# కాడెద్దులు కరువాయే.. యంత్రాల సేద్యం బరువాయే

**పులివెందుల రూరల్ :** ప్రస్తుత ఆధునిక యుగంలో కొత్త పుంతలు తొక్కుతున్న క్రమంలో కాడెద్దులు కరువయ్యాయి. యంత్రాల సేద్యం బరువవుతోంది. వ్యవసాయంలో నేటి రైతుల పరిస్థితి ఇది. వ్యవసాయం అనగానే మనకు గుర్తొచ్చేది ఎద్దులు, బండ్లు, పరికరాలు. కానీ యాంత్రిక జీవనం సాగిస్తున్న సగటు రైతు ఇవన్నీ పక్కన పెట్టాడు. ఏ గ్రామంలో చూసినా వ్యవసాయానికి యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. కాడెద్దులు దొరకడం గగనమవుతోంది. రూ.70 వేల నుంచి రూ.1.50 లక్షలు వెచ్చిస్తే కానీ కాడెద్దులు దొరకవు. పైగా పశుగ్రాసం కొరత తీవ్ర స్థాయిలో ఉండటంతో వీటిని పోషించాలంటే రైతుకు సాధ్యం కాలేదు. అదేవిధంగా పశుగ్రాసం కోసం సాగించే పంటలు కూడా చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పశుగ్రాసం కోసం ఉపయోగపడే వేరుశనగ, జొన్న, గడ్డి వంటి పంటలకు రైతులు స్వస్తి పలికారు. విపరీతమైన ఖర్చు రావడం, చేతికందిన దిగుబడికి సరైన గిట్టుబాటు ధర లభించకపోవడం కారణంగా పశుగ్రాసం కోసం వినియోగించే పంటలకు దూరమవుతున్నట్లు రైతులు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే నాగలి పట్టి సేద్యం చేసే రైతు ఎక్కడా కనిపించడం లేదు. పంట నూర్పిడి కోసం వివిధ రకాల యంత్రాలు



ట్రాక్టర్ సాయంతో సేద్యం చేస్తున్న రైతు



గతంలో కాడెద్దులతో సేద్యం చేస్తున్న రైతు

అందుబాటులోకి రావడంతో పొలం గట్లపైనే దిగుబడి పొందడం, విక్రయించడం జరుగుతోంది. దీంతో పశుగ్రాస సమస్య ఎదురవుతోంది. ఈ పరిస్థితులలో ఎద్దులను పెంచి పోషించాలంటే సగటు రైతుకు ఎంతో కష్టతరమవుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కాడెద్దులకు బదులుగా యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు రైతులు వెల్లడించారు. యంత్రాల సేద్యం కూడా రైతుకు భారమవుతోంది. డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో వాటిని ఉపయోగించుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులలో సామాన్య రైతులు యంత్రాల సేద్యం ఉపయోగించాలంటే బాడుగలు చెల్లించలేక అనేక కష్టాలు పడుతున్నారు. మరో వైపు వ్యవసాయ కూలీల ఖర్చులు, సస్యరక్షణ చర్యలు, ఎరువుల ధరలు కలిపి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రభుత్వాలు కూడా సరైన ప్రోత్సాహం అందించకపోవడంతో వ్యవసాయం భారమవుతోందని సామాన్య రైతులు అభిప్రాయపడుతున్నారు. కాడెద్దుల వ్యవసాయం పునర్దర్శనం కావాలంటే పశు సంపద పెరగాలి. అలాగే పశువుల పోషించడానికి ఉపయోగపడే వేరుశనగ, జొన్న, కొర్ర తదితర పంటలను సాగు చేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పంటలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అదేవిధంగా వీటికి సంబంధించి ప్రభుత్వం కూడా వెసులుబాటు కల్పించాల్సిన అవసరం కూడా ఉంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి దీర్ఘ కాలిక రుణాలు, వడ్డీ లేని రుణాలు అందిస్తే ఉపశమనం కలుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు అధికార యంత్రాంగం స్పందించి రైతులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తే కొంతవరకైనా కాడెద్దులతో వ్యవసాయం చేసే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### కాడెద్దులు కొనాలంటే లక్షలాది రూపాయలు వెచ్చించాలి



గతంలో ఈ గ్రామంలో చూసిన ఎద్దులతో వ్యవసాయం చేసి పంటలు సాగు చేసేవారు. ప్రస్తుతం కాడెద్దులతో వ్యవసాయం చేసేవారే కరువయ్యారు. ప్రస్తుతం కాడెద్దులు కొనాలన్నా లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు కంప్యూటర్ కాలంలో చాలామంది యంత్రాలతో వ్యవసాయం చేస్తున్నారు. నాలాంటి సన్నకారు రైతులు యంత్రాలకు ఖర్చు పెట్టాలన్నా కూడా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాలు స్పందించి రైతులకు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– కనక, రైతు, పులివెందుల

### నాగలి పట్టి సేద్యం చేసే రైతులు కనపడలేదు



ప్రస్తుతం కంప్యూటర్ కాలంలో ఎక్కడ చూసినా యంత్రాలతోనే వ్యవసాయం చేస్తున్నారు. గతంలో నాగల పట్టిందే గ్రామీణ ప్రాంతాల్లో సేద్యం చేసేవారు కాదు. పంట నూర్పిడిల కోసం వివిధ రకాల యంత్రాలు అందుబాటులోకి రావడంతో చాలామంది రైతులు యంత్రాలనే వాడుతున్నారు. పశుగ్రాసం కొరత ఎదురవుతుంది ఎద్దులను పోషించాలంటే భారమవుతుంది. కాడెద్దులకు బదులుగా యంత్రాలను ఉపయోగిస్తున్నాం,

– పుష్పనాథరెడ్డి, రైతు, కొత్తపల్లె

## క్లుప్తంగా

### రేపు మండల సర్వసభ్య సమావేశం

**సింహాద్రిపురం :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఈనెల 24వ తేదీ గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు.

### పశువైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్

**వీరపునాయునిపల్లె :** మండలంలోని కీర్తిపల్లెలో మంగళవారం ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల స్టూడెంట్స్ నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 750 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో గర్భకోశ వ్యాధుల చికిత్సలు, తదితర వైద్య పరిక్షలు నిర్వహించడంతో పాటు నట్టల నివారణ మందు తాగించారు. గొర్రెలకు ఇటి వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, వైద్యాధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది



విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

**వేంపల్లె :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను ఎమ్మెల్సీ అభినందించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఆట స్థలంకు గోడను నిర్మించాలని వ్యాయామ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనువాసులు, మాజీ ఎంపీటీసీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**కొండాపురం :** గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు ఆకు కూరలతో పాటు పాలు, గుడ్డు తీసుకోవడం వల్ల రక్తహీనత భారిన పడకుండా ఉంటారని అంగన్‌వాడీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. మంగళవారం మండలంలోని గండ్లూరు, ఓబన్నపేట అంగన్‌వాడీ సెంటర్‌లల్లో పోషణ పక్వాడ సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుండి 2 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం తప్పకుండా ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలపై తల్లి దండ్రులకు చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. బాలింతలు పుట్టిన బిడ్డకు మూరిపాలు పట్టడం వల్ల బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటాడన్నారు.

### కల్యాణ వైభోగమే!



మాంగళ్య దర్శనం చేయిస్తున్న అర్చకులు

**కడప కల్చరల్ :** దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించారు. అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితోపాటు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు నగర వాసులు హాజరయ్యారు.

### ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** ఆర్టీసీ బస్సులు నడిపే డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దేందుకు తమ వంతు తోడ్పాటు ఇవ్వాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ అన్నారు. కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో డ్రైవర్లకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలుత ఓం శాంతి సంస్థ ప్రతినిధి యోగా, ధ్యాన ప్రక్రియలు వివరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ బస్సు నడిపేటపుడు డ్రైవర్ల కుటుబసభ్యులతో పాటు ప్రయాణికుల భద్రతను గుర్తు పెట్టుకోవాలని, విధులు ముగిసే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం రీజనల్ సేఫ్టీ అధికారి కృష్ణారెడ్డి, డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు.

### వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**లింగాల :** స్థానికంగా ఉన్న దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమంలో మంగళవారం కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి పుట్టినరోజు సందర్భంగా బీజేపీ నాయకులు భానుప్రకాష్, మహేశ్వరరెడ్డిలు వికలాంగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### ఉరుసు కరపత్రాల విడుదల



ఉరుసు కరపత్రాలను విడుదల చేస్తున్న పీఠాధిపతి

**జమ్మలమడుగు :** ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీ రాఖాద్రీ ఆధ్వర్యంలో హజరత్ సయ్యద్‌షా బడేగౌస్ పీరాఖాద్రీ 93వ ఉరుసుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసు మహోత్సవం సందర్భంగా మే 1వ తేదీ నిషాన్ జెండా ఆవిష్కరణ, 3వ తేదీ శనివారం హిజామా(కప్పింగ్ థెరఫి), 4వ తేదీ ఆదివారం నిరుపేద ముస్లిం పిల్లలకు ఖత్నా, 9వ తేదీ శుక్రవారం గంథోత్సవం, శనివారం ఉరుసు మహోత్సవం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పీఠాధిపతి తనయుడు సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, ఆస్థానయే గౌసియా అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# నేతల చేతుల్లోకి ఉపాధి హామీ

**చక్రాయపేట :** ఉపాధి హామీ పథకం నేతల చేతుల్లోకి వెళ్లింది. తాము చెప్పినట్లు చేయాల్సిందే. మేము చెప్పిన వారికే పనులు పెట్టాలి లేకుంటే మీ ఉద్యోగాలు ఊడుతాయి. మీస్థానంలో కొత్త వాళ్లు వస్తారు అంటూ కూటమికి చెందిన చోటా మోటా నేతలు హుకుం జారీ చేస్తుండటంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు భయంతో వణికి పోతున్నారు. ఈ విషయంలో కూటమికి చెందిన గ్రామ నేతలు మండలస్థాయి నేతలు మందలిస్తున్నా చోటామోటా నాయ కులు మాత్రం పట్టు వదలక బెదిరింపులకు దిగుతూనే ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు దిక్కు తోచక తలలు పట్టుకు కూర్చుంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మీచావు మీరు చావండి మాకెందుకు తలనొప్పులు అంటూ తప్పుకుంటున్నారని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు మదన పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామాల్లో ఉపాధి పనులు చేసే కూలీలు గ్రామ గ్రామానా వందలాది మంది ఉన్నారు. అయితే ప్రతి కూలీకి పని కల్పించాలన్నది ప్రభుత్వ ఆశయం. అయితే ఇక్కడ ఆ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో వందల సంఖ్యలో కూలీలు పనులు చేస్తుంటే మరి కొన్ని గ్రామాల్లో పదుల సంఖ్యలో మరిన్ని గ్రామాల్లో అసలే పనులు లేక కూలీలు అల్లాడిపోతున్నారు. ఈ విషయంపై కూలీలు ఇక్కడి అధికారులకు మొర పెట్టుకున్నా కాస్తంత జాలి కూడా చూపకపోగా చోటా మోటా నేతల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో దిక్కు తోచని కూలీలు ఏకంగా డ్వామా పీడీకి ఫోన్ చేసి మాకు పనులు కల్పించండి..

ఇక్కడి అధికారులు పలకడంలేదు అని మొర పెట్టుకున్నారు. దీంతో పీడీ ఫోన్‌లో ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కూలీలకు పనులు కల్పించాలని ఆదేశాలు చేసినా ప్రయోజనం లేదు. సిబ్బంది తీరు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా వారు వ్యవహరిస్తున్నట్లు కూలీలు పేర్కొంటున్నారు.


### పదవీ విరమణ



జాఫర్ సాదిక్‌ను సన్మానిస్తున్న విద్యా సంస్థల సిబ్బంది

**వీరపునాయునిపల్లె :** మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్ పదవీరమణ కార్యక్రమం మంగళవారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓల సంఘం అధ్యక్షుడు గంగిరెడ్డి మాట్లాడుతూ మూడు మండలాలకు విద్యాశాఖాధికారిగా జాఫర్ సాదిక్ ఎటువంటి సమస్యలు లేకుండా నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క మండలంలో విధులు నిర్వహించడం కష్టమని మూడు మండలాల్లో విధులు నిర్వహించడం చాలా గర్వకారణమన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాపర్ సాధిక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీలు, కార్యాలయ సిబ్బంది సహకారంతో విధి నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించానన్నారు. కార్యక్రమంలో వీరపునాయునిపల్లె, కమలాపురం, వేంపల్లె ఎంఈఓ2 అనిత, సుబాషిణి, స్టాలిన్, ఒంటిగారి విద్యాసంస్థల అధినేత వెంకటసుబ్బానాయుడు, భారతి సిమెంటు హెచ్ఓడీ కిషోర్, ప్రదానోపాధ్యాయురాలు సుభాషిణి, రిటైర్డ్ ఎంఈఒ చెన్నారెడ్డి, సంగమేశ్వర విద్యాసంస్థల అదినేత సుబ్బానాయుడు, ఉషాకిరణ్ స్కూలు కరస్పాండెంటు రమణారెడ్డి, కమలాపురం, గోపవరం ఎంఈఓ1 బేబి, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

**సింహాద్రిపురం :** ఉపాధి కూలీల సంఖ్యను పెంచి గుర్తించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఉపాధి సిబ్బందికి సూచించారు. మంగళవారం సింహాద్రిపురం, గురిజాల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ తనిఖీ చేసి మాట్లాడారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గత 8 వారాల నుంచి కూలీ డబ్బులు అందడంలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకరాగా, త్వరలోనే కూలీ డబ్బులు మంజూరువుతాయన్నారు. అలాగే లోమడ గ్రామంలో ఏపీఓ విజయభారతి ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఇంజనీర్ అసిస్టెంట్ గంగిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ భవాని, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం పెరుగుతుంది



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయమ్మ

**వేంపల్లె :** రైతులు సాగు చేసే పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో చేపడితే రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు ఆదాయం పెరుగుతుందని ఎంపీడీఓ కుళాయమ్మ, వ్యవసాయ అధికారి రాజేంద్ర ప్రసాద్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని వైఎస్ఆర్ సభా భవనంలో ప్రకృతి వ్యవసాయం, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఖరీఫ్ ప్రణాళిక 2025 పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంవల్ల భూమిని ఆరోగ్యకరంగా కాపాడుకోవచ్చునన్నారు. పంటలు సాగు చేసే సమయంలో రైతులకు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రైతులను గుర్తించి కేవీపీ చేసి రైతులను గుర్తించాలని కోరారు. ఆర్ఎస్‌కే ఇన్‌చార్జిలు కలిసి రైతులు భూసార మట్టి పరీక్షలు చేయించుకునేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వరరావు, ఏపీ సీఎన్ఎఫ్ మాస్టర్ ట్రెనర్ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

# ఉర్దూ డీఐ పోస్టులు భర్తీ చేయాలి

**కడప ఎడ్యుకేషన్:** రాయలసీమ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్) పోస్టులు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ షేక్ ముహమ్మద్ అయుబ్, వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ కోరారు. పాఠశాల విద్య ఆర్జేడీ శ్యాములేను ఈ విషయమై మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణ, సమగ్రాభివృద్ధికి ఉర్దూ డీఐ ఎంతో దోహదపడతారని అన్నారు. హెచ్ఎంలకు పదోన్నతులు కల్పిస్తున్న తరుణంలో సమాన హోదా కలిగిన ఉర్దూ డీఐ పోస్టులు భర్తీ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్, నగర అధ్యక్షుడు ఖాదర్ బాషా, కోశాధికారి నూరుల్లా పాల్గొన్నారు.

### సర్వే సక్రమంగా చేయండి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

**ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) :** అసంక్రమిత వ్యాధుల సర్వేను ప్రతి వైద్యాధికారి, వైద్యసిబ్బంది సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎన్.నాగరాజు తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల, చిలంకూరు పీహెచ్‌సీలను ఆయన తనిఖీ చేసి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్ధేసించిన ప్రకారం ఇంటింటి సర్వేను కచ్చితంగా చేయాలన్నారు. పీఎంజేఏవై కార్డులపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని డెలవరీ కేసు నమోదు అయ్యేల చూడాలన్నారు. మీకు ఇచ్చిన లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు పూర్తి చేయాలన్నారు. రోగులకు ప్రతి వైద్యాధికారి అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శివప్రసాద్, వైద్యులు, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వేంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలి

**జమ్మలమడుగు :** ఆశ వర్కర్స్‌కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మరియమ్మ, ఏఐటీయూసీ పట్టణ నాయకులు ప్రసాద్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద వారు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 20 సంవత్సరాల నుంచి ఎలాంటి విద్యాఅర్హత లేకుండా వయసుతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేస్తున్న ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కరోనా సమయంలో రూ.6 వేలు అలవెన్స్ ప్రకటించినా ఇంత వరకు ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యం అన్నారు. ఆశ వర్కర్‌లకు నెలకు రూ.26 వేలు జీతం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.
22జెయండి02 ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

### భూమిలో పోషకాల స్థాయి తెలుసుకోవచ్చు



మట్టి నమూనాల సేకరణను పరిశీలిస్తున్న ఏవీ నరసింహారెడ్డి

**ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) :** భూమిలో ఉన్న మట్టి నమూనాలను బట్టి ఆ భూమిలో పోషకాలు ఏఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం హనుమనుగుత్తి గ్రామ పరిధిలోని పోలాలలో మట్టి నమూ నాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 858 మట్టి నమూనాల సేకరణే లక్ష్యంగా పరిశీలిస్తున్నామన్నారు. మట్టి నమునాల ద్వారా వచ్చిన పోషకాల విలువల స్థాయిని బట్టి రైతులు ఎరువులను వాడవచ్చన్నారు. దీని వలన రైతులకు ఎరువుల మీద అయ్యే ఖర్చు కూడా తగ్గించ వచ్చన్నారు. ఏదన్నా సూక్ష్మ పోషకాల లోపాన్ని కనుగొని వాటిని సరైన మోతాదులో పంటలకు అందించడం వల్ల అధిక దిగుబడులకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### 27న ఉచిత వడుగులు

**కడప కల్చరల్:** పేద ముస్లింలకు ఈ నెల 27న ఉచిత వడుగుల (ఖత్నా) కార్యక్రమం నిర్వహించనున్నామని సెక్రటరీ మౌల్వి ఖాజీ షేక్ మొహమ్మద్ అలీ రషది తెలిపారు. కడప రవీంద్ర నగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

# నకిలీ అరటి మొక్కలను విక్రయిస్తే కఠిన చర్యలు



పూత రానీ అరటి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రేష్మా, హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి

**సింహాద్రిపురం :** నకిలీ అరటి మొక్కలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నంద్యాలంపల్లె గ్రామ రైతు వాసుదేవారెడ్డి గత ఏడాది తన 3.50 ఎకరాల తోటలో కిసాన్ అగ్రోటెక్ కంపెనీకి చెందిన 4,700 అరటి మొక్కలను నాటుకున్నారు. అయితే అరటి మొక్కలు గెలలు వేయకపోగా, తోటలో చెట్లన్ని వేరు వ్యవస్థ సరిగా లేనందున ఆరు నెలల్లో రావాల్సిన పూత, 9 నెలలైనప్పటికి పూత రాలేదని వాపోయాడు. దీంతో పూత రానీ అరటి తోటను పులివెందుల అరటి పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ రేష్మా పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ అరటి చెట్లను ల్యాబ్‌లో పరీక్షించి నివేదిక రాగానే కంపెనీ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

# మలేరియా నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొహిద్దీన్

**పులివెందుల రూరల్ :** మలేరియా నియంత్రణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలలో మలేరియాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఆయన డ్రాయింగ్, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ఆందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శాంతికుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ హరిత, సీనియర్ అసిస్టెంట్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్



వేంపల్లె : ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**పులివెందుల టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ అధికారి ఆదేశాల మేరకు కడప నగరంలోని జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు 5 మంది ఎంపిక కావడం చాలా హర్షించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ కళాశాల విద్యార్థులు ఇలాంటి ఉద్యోగాలను పొందడం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు.
కళాశాల నుండి ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ పి.రాధిక నేతృత్వంలో 8 మంది విద్యార్థులు జాబ్ మేళాకు హాజరవ్వగా, అందులో బీకాంకు చెందిన పి.వసంత, డి సింధుశ్రీ, నీలిమ, కె.వి.చందన, ఎం.మేరీలు ఉద్యోగాలకు ఎంపిక కావడం చాలా గర్వకారణమన్నారు. విద్యార్థులకు కడపలోని డోను బీపీఓ అండ్ ఐటీ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు రావడంపట్ల కళాశాల వైస్ ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు.
**వేంపల్లె :** రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాను ప్రకారం కడప జిల్లా ప్రభుత్వ కళాశాలలో మంగళవారం జాబ్ ఫెస్ట్ నిర్వహించారు. వేంపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 6 మంది విద్యార్థులు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. తమ కళాశాల నుండి ప్లేస్మెంట్ ఆఫీసర్ అరవింద్ నాయకత్వంలో 8 మంది విద్యార్థులు హాజరవ్వగా, ఆరు మంది విద్యార్థులు వినోద్, అయ్యేషా, సింధుకుమారి, గంగా స్రవంతి, గంగాదేవి, దీపలు ఉద్యోగం పొందడం చాలా గర్వకారణమన్నారు. ఇప్పటికే 80 మంది విద్యార్థులు జాబ్ డ్రైవ్‌లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాలలకు పోటీగా ఈ డిగ్రీ కళాశాల ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

# అదుపు తప్పితే అంతే సంగతులు



అధిక లోడుతో ప్రయాణికులను తీసుకెళుతున్న ఆటో

**వేంపల్లె :** స్థానిక కడప రోడ్డులో పోలీస్‌స్టేషన్ ముందు ఒక ఆటో ఏకంగా 20 మందిని కూలీలను తీసుకెళ్తుంది. ఏదైనా అదుపు తప్పితే వారి ప్రాణాలు గాలిలో కలిసి పోవాల్సిందే. ప్రతిరోజు ఆటోలు ఉదయం 7 గంటలకు నుండి 8:30 వరకు గ్రామీణ ప్రాంతాలకు కూలీలను ఆటోలలో తీసుకెళ్తుంటారు. పోలీసులు చూస్తూ కూడా పట్టించుకోవడం లేదు. ఆటోలను ఆపి కౌన్సిలింగ్ ఇవ్వాల్సిందిపోయి పట్టీ పట్టనట్టుగా వ్యవరిస్తున్నారు. దీంతో ఆటోలు ఇష్టానుసారంగా అధికలోడుతో ప్రయాణీకులను తీసుకెళ్లి ప్రమాద బారినపడుతున్నారు.